ఈనాడు
పార్వతీపురం మన్యం
బుధవారం అక్టోబరు 23, 2024


గుర్లలోని పీహెచ్‌సీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయానంద్

క్షేత్రస్థాయికి వెళ్లండి.. లోపాలను సరిచేయండి

గుర్ల ఘటనపై ప్రత్యేక కార్యదర్శి వ్యాఖ్యలు

ఈనాడు– విజయనగరం, న్యూస్‌టుడే, గుర్ల, విజయనగరం అర్బన్: గుర్ల ఘటనపై ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విచారణాధికారిగా నియమితులైన ఆయన మంగళవారం జిల్లాలో పర్యటించారు. ముందుగా విజయనగరంలో అన్నిశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఇంత పెద్ద వైద్య వ్యవస్థ ఉండి.. మందులు, వసతులు కొరత లేకున్నా వ్యాధిని అరికట్టలేకపోయామన్నారు. అన్ని విభాగాల వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, లోపాలను సరిచేసుకోవాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్యశాఖల వారు చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలు, పారిశుద్ధ్య పనులు, వైద్య సాయం తదితర అంశాలను తెలుసుకున్నారు. మృతుల్లో కిడ్నీ, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా ఉన్నారని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.

పైపులైన్లు మార్చండి..

గుర్ల పీహెచ్‌సీలో బాధితులను పరామర్శించారు. అనంతరం పలు వీధుల్లో తిరిగారు. తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండడం సరికాదన్నారు. వాటిని తొలగించాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో కొత్త కేసులపై ఆరా తీశారు. కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేధు మాధవన్, డివిజినల్ పంచాయతీ అధికారి మోహనరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

స్వచ్ఛ పార్వతీపురానికి కృషి

పార్వతీపురం పట్టణం, కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురంను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో చిత్రలేఖన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ పార్వతీపురంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ, రైల్వే స్టేషన్లు, జన సంచారం ఉన్నచోట లోగోలు, సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, బహిరంగ గోడలపై ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా చిత్రాలు వేయాలని కోరారు.

అందంగా అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లాలోనిని 516 అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలని పీడీ ఎం.ఎన్.రాణికి కలెక్టర్ సూచించారు. కేంద్రాల బయట, లోపల వర్ణ చిత్రాలు వేయించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. బోర్డులు, ఇతర సామగ్రి పంపిణీ చేస్తామని చెప్పారు.

ఆస్తి, ప్రాణ నష్టం జరగకూడదు..

ఈనెల 23 నుంచి 26 వరకు జిల్లాపై తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈదురుగాలులు, భారీ వర్షాలతో ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 14న లోక్ అదాలత్

బెలగాం, న్యూస్‌టుడే: కేసుల పరిష్కారానికి రాజీయే ఉత్తమ మార్గమని, అందుకు లోక్ అదాలత్ సరైన వేదికని జిల్లా న్యాయసేవా సంస్థ ఛైర్మన్, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని చెప్పారు. సివిల్, క్రిమినల్, ఇతర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కక్షిదారులను కోరారు.

హంస వాహనంపై ఇలవేల్పు వైభవం

కనుల పండువగా పైడితల్లి తెప్పోత్సవం


తల్లి దర్శనానికి బారులుదీరిన భక్తులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం కనులపండువగా సాగింది. ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తల్లి సేవకుల నేతృత్వంలో పెద్ద చెరువు పశ్చిమ భాగాన వైభవంగా జరిగింది. మధ్యాహ్నం వేదసభ, అమ్మవారికి స్నపన, క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణతో కూడిన పల్లకిలో ప్రతిష్ఠించి, వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా గాడీఖానాకు తీసుకొచ్చారు. 5.30 గంటలకు రాజహంస ఆకారంలోని తెప్పపై తల్లి కొలువుదీరింది. దేవస్థానం సిబ్బంది, వేదపండితులు, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో మూడుసార్లు తెప్పను చెరువు చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా దర్శనాలకు భక్తులు బారులుదీరారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. రాత్రి వనంగుడిలో మెట్లోత్సవం చేపట్టారు.


ఉత్సవ విగ్రహానికి పసుపుతో అభిషేకం చేస్తున్న నిత్య సేవకులు, దీక్షాధారులు


పెద్ద చెరువులో హంస వాహనంపై విహరిస్తున్న అమ్మవారు

ఆశల సౌధం.. అల్లంత దూరం

ఉమ్మడి విజయనగరం జిల్లాకు మంజూరైన కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరానికి(2025-26) అందుబాటులోకి తెచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఉన్నత విద్యామండలి దీనిపై నివేదిక కోరినట్లు జేఎన్‌టీయూ అధికారులు ధ్రువీకరించారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో రెండు నెలలుగా గుత్తేదారులు పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో కదలిక రానుందని భావిస్తున్నారు.


కురుపాంలో మధ్యలోనే ఆగిపోయిన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు

నిధుల ఖర్చుల తీరిదీ.. (రూ.కోట్లలో)

- నిర్మాణ వ్యయం: 153.853
- ఇప్పటి వరకు ఖర్చు: 43.53
- జేఎన్‌టీయూ మంజూరు చేసింది: 23.00
- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది: 4.53
- పెండింగ్‌లో ఉన్న బిల్లులు: 16.00

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం, కురుపాం గ్రామీణం

కురుపాం మండలం టేకరికండి ప్రాంతంలో 105 ఎకరాల్లో కళాశాల నిర్మాణానికి 2020 అక్టోబరు రెండో తేదీన ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టేందుకు రూ.153.853 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. తొలుత నిధులు విడుదల చేయకపోవడంతో జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం విడతల వారీగా మంజూరు చేసింది. దీంతో కొంతమేర జరిగాయి. అనంతరం ప్రతిపాదన మేరకు 2023-24 బడ్జెట్‌లో రూ.32.99 కోట్లు ఇస్తామని వైకాపా ప్రకటించినా విడుదల చేయలేదు. ఈక్రమంలో నాలుగేళ్లుగా ప్రవేశాలకు నోచుకోలేదు.

గత ప్రభుత్వంలో..

- కళాశాల తొలుత జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. 2022 జనవరిలో నగరంలోని గురజాడ విద్యాలయం పరిధిలోకి వచ్చింది. ఒక కోర్సుకు 60 సీట్ల చొప్పున సివిల్, మెకానికల్, సీఎస్ఈ, ఇఇఇ, ఈసీఈ కోర్సుల్లో 300 సీట్లకు 2022లో ఆమోదం లభించింది.
- బోధన 80, బోధనేతర పోస్టులు ఆరు మంజూరయ్యాయి. పొరుగుసేవల కింద 48 ఉద్యోగాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటిలో తొమ్మిది బోధన పోస్టులను హేతుబద్ధీకరణలో భాగంగా విజయనగరం విశ్వవిద్యాలయానికి బదలాయించారు.
- గిరిజన విద్యార్థులకు ప్రత్యేక కోటా ఇచ్చే ప్రతిపాదనను స్థానికులు తెరపైకి తీసుకొచ్చినా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

అకడమిక్ బ్లాక్ 70 శాతం పూర్తయింది. రెండు అంతస్తుల వరకు వసతిగృహాల నిర్మాణాలు జరిగాయి. ఇంకో రెండు అంతస్తుల మేర పనులు చేపట్టాలి. ఫ్లోరింగ్, విద్యుత్తు, రోడ్లు, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉందని ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈఈ రామకృష్ణ తెలిపారు. సోమవారమే నివేదికను పంపించినట్లు ఇన్‌ఛార్జి ఉప కులపతి డి.రాజ్యలక్ష్మి చెప్పారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి, పనులు పూర్తిచేయిస్తామని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి చెప్పారు.

వరద బాధితులకు రూ.3.80 లక్షలు

పార్వతీపురం గ్రామీణం, బలిజిపేట, సీతానగరం, న్యూస్‌టుడే: వరద బాధితులకు సాయంగా ముందుకు వచ్చిన వారిని ఎమ్మెల్యే విజయచంద్ర అభినందించారు. మంగళవారం బలిజిపేట మండలానికి చెందిన నాయకులు సేకరించిన రూ.3.65 లక్షలు ఎమ్మెల్యేకు అందజేశారు. పెదపెంకి గ్రామస్థులు- రూ.1.25 లక్షలు, సుభద్ర- రూ.40 వేలు, వంతరాం- రూ.35 వేలు, జనార్దనవలస- రూ.28,900, అరసాడ- రూ.25 వేలు, నూకలవాడ- రూ.20 వేలు, మురగడం- రూ.20 వేలు, బలిజిపేట- రూ.15 వేలు, వెంగాపురం- రూ.15 వేలు, మిర్తివలస, బర్లి, రావివలస గ్రామస్థులు రూ.10 వేల చొప్పున, పెద్దింపేట- రూ.7 వేలు, చెల్లంపేట, శివరాంపురం ప్రజలు రూ.5 వేలు ఇచ్చారు. ★ సీతానగరం మండలం కోటసీతారాంపురానికి చెందిన కె.రామకృష్ణ, కృష్ణమూర్తి, రామారావు, వెంకటరమణ రూ.15 వేలను ఎమ్మెల్యేకు అందజేశారు.


ఎమ్మెల్యేకు నగదు ఇస్తున్న నాయకులు

గాల్లోనే గోపురం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద గాలిగోపురం నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఇది ఒకటి. భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఏటా శివరాత్రి తరువాత వచ్చే ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతరకు 5 లక్షలకు పైగా తరలివస్తుంటారు. ఆదాయం సైతం పుష్కలంగా ఉంటుంది. పట్టణ శివారున విశాల ప్రాంగణంలో దేవస్థానం అభివృద్ధి చెందింది. ప్రవేశ ద్వారం వద్ద గాలిగోపురాన్ని నిర్మించాల్సి ఉంది.

ప్రతిపాదనలకే పరిమితం..

ఈ నిర్మాణానికి దాదాపు రూ.50 లక్షల ఖర్చవుతుందని అంచనా వేశారు. దేవాదాయశాఖ సీజీఎఫ్ కింద నిధులు మంజూరు చేయాలి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈమేరకు ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పటికే గర్భగుడి నిర్మాణానికి నిధులు రావడంతో.. ఈ ప్రతిపాదన అలాగే ఉండిపోయింది. వైకాపా అధికారంలోకి వచ్చాక కనీసం కదలిక లేకుండా పోయింది. 'గాలిగోపురాన్ని దర్శిస్తే శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని' ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర విద్యుత్తు

ఈనాడు, విశాఖపట్నం: సౌర విద్యుత్తు వినియోగానికి ముందుకు వచ్చేవారికి పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు ఆర్థిక సాయం చేస్తున్నాయి. అయితే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిస్కంల వారీగా వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది.



వందశాతం రాయితీతో సోలార్ పరికరాలు

ఇద్దరికీ లాభమే..

- ఈ కనెక్షన్ల వల్ల లబ్ధిదారులతో పాటు ప్రభుత్వానికీ ప్రయోజనమే. సౌర పలకలపై పెట్టుబడితో యంత్రాంగంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా దీర్ఘకాలంలో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా తగ్గనుంది.
- ఇప్పటికే ఎస్సీ, ఎస్టీల్లో 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌పై సుమారు రూ.6 వరకు వెచ్చిస్తోంది. అదే సోలార్ ద్వారా అందించగలిగితే ఆ సొమ్ము ఆదా అయినట్లే. ఈ లబ్ధిదారులు చాలా మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలతో నెలకు 120 యూనిట్లు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 20 నుంచి 30 యూనిట్ల భారమే ప్రభుత్వంపై పడుతుంది.
- 'ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ ఉత్పత్తి జరిగితే ఆ మిగులును డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. ఒకసారి పలకలు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా వినియోగించవచ్చు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుంది' అని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

కనెక్షన్ల సంఖ్య ఇలా..

ఉమ్మడి సర్కిల్	ఎస్సీ	ఎస్టీ
విజయనగరం	57,601	45,252

దళారులు ఇచ్చిందే ధర

దోపిడీకి గురవుతున్న పత్తి రైతు

కానరాని కొనుగోలు కేంద్రాలు

– న్యూస్‌టుడే, బొబ్బిలి, రామభద్రపురం

పత్తి రైతులు దగాకు గురవుతున్నారు. పంట కోత దశకు వచ్చింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో చేతికి అందడంతో అన్నదాతలు నిల్వ చేసుకోలేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరవకపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేసి నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈక్రమంలో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.


ప్రైవేటు కాటాల వద్ద తూకం

క్వింటాకు రూ.800 నష్టం..

ప్రైవేటు ట్రేడర్లు క్వింటాను రూ.6,700కు కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం రూ.7521లు ప్రకటించింది. అంటే క్వింటాకు రూ.800 పైచిలుకు నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. మరోవైపు తూకంలో కూడా తేడా చూపిస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.5 కిలోల వరకు అదనంగా ఇచ్చేస్తున్నారు.

పరిస్థితి ఇదీ..

ఉమ్మడి జిల్లాలో 1370 హెక్టార్లలో పత్తి సాగవుతోంది. హెక్టారుకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఏటా 11 వేల క్వింటాళ్ల వరకు చేతికి అందుతోంది. ఈనెలలో మొదటి దశ కోత ప్రారంభమైంది. రామభద్రపురం, మక్కువ, సాలూరు, తెర్లాం, బాడంగి, దత్తిరాజేరు, మెరకముడిదాం మండలాల్లో ఎక్కువగా చేతికొచ్చింది. తొలి దశలో 4 వేల క్వింటాళ్ల వరకు అమ్మకానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే చాలామంది రైతులు సేకరించి ఇళ్లల్లో నిల్వ చేశారు. ఈక్రమంలో వర్షాల కారణంగా పాడవుతుందన్న ఉద్దేశంతో ప్రైవేటు ట్రేడర్లకు విక్రయిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..

దీపావళి పండగ ముందుగా ఉండడంతో ఇళ్లల్లో నిల్వ చేసుకోవడం ఇబ్బంది. అందుకే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నాం. ప్రభుత్వం రామభద్రపురంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంత వరకు పెట్టలేదు.

- ఎం.తిరుపతి, వై.మురళి, రామభద్రపురం, రైతులు

రెండు కేంద్రాలు ఎక్కడ..

ప్రభుత్వ రాజాం, రామభద్రపురంలో కేంద్రాలు తెరుస్తామని ప్రకటించింది. కానీ ఇంతవరకు ఏర్పాటు కాలేదు. త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ రవికిరణ్ తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) సహకారంతో కేంద్రాలు నడుస్తాయన్నారు. మద్దతు ధరకు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ రామారావు చెప్పారు.

జలం కాదు.. గరళం


పాలకొండలోని కాపువీధి కూడలిలో ప్రధాన లైను దుస్థితి


బెలగాంలోని ఎస్సీ వీధిలో కాలువలోనే తాగునీటి పైపులు

6లో

గుంతల దారి.. గుండెలు జారి


ఇటీవల వచ్చిన వరదలకు సంతకవిటి మండలం రెల్లిగెడ్డపై కోతకు గురైన రోడ్డు

6లో


సాలూరులో దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సరిహద్దుల్లో అప్రమత్తత అవసరం

సాలూరు గ్రామీణం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర సరిహద్దు పోలీసు స్టేషన్లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎస్వీ.మాధవరెడ్డి సూచించారు. మంగళవారం సాలూరు, మక్కువ పోలీసుస్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. సాలూరు ఠాణా ఆవరణలో మొక్కలు నాటారు. ఏఎస్పీ అంకితా సురాన, సీఐ రామకృష్ణ, ఎస్ఐలు నర్సింహమూర్తి, వెంకటరమణ ఉన్నారు.

శ్వాసకోశ రోగులకు మెరుగైన వైద్యం

'న్యూస్‌టుడే'తో ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు

ముఖాముఖి



– న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం

ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బంది పడేవారు గతంలో ప్రైవేటు ఆసుపత్రులకు, లేకుంటే పొరుగు జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోని విజయనగరం మహారాజా ప్రభుత్వ వైద్యాలయంలో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఇటీవలే ఈ విభాగానికి సంబంధించిన నిపుణులు అందుబాటులోకి రావడంతో మరింత మెరుగయ్యాయి. మరోవైపు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ కింద సైతం చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పులతో ఎక్కువ మంది ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు **డా.బి.సంతోష్‌కుమార్** తెలిపారు. 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు విషయాలను వెల్లడించారు.

వారికి ప్రత్యేక చికిత్సలు..

ఆస్తమా, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా చికిత్సలు అందిస్తున్నాం. ఇన్ హేలర్ పరికరాన్ని ఉచితంగా ఇస్తున్నాం. క్షయ నిర్ధారణ పరీక్షలు సైతం చేస్తున్నాం. వ్యాధి ఏ భాగానికి సోకిందో తెలుసుకుని ఆ మేరకు వైద్యం చేస్తున్నాం. ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుపోవడం, చీము పట్టడం, నీరు చేరడం.. తదితర కేసులు ఎక్కువగా బయటపడుతున్నాయి. స్పైరోమెట్రి యంత్రం ద్వారా నిర్ధారించుకుని, ముందుకెళ్తున్నాం.

పొగతాగితే తీవ్ర ముప్పు..

ప్రస్తుతం అన్ని దేశాల్లో లంగ్ క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు. ఊపిరితిత్తుల్లో అనియంత్రణ కణాల పెరుగుదల వల్ల వస్తోంది. పొగ తాగిన వారిలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ అలవాటు లేకున్నా.. పక్కన నిల్చున్న వారికి కూడా సోకే ప్రమాదం ఉంది. ఉమ్మడి జిల్లాలో అడ్డపొగ కాల్చేవారు ఇప్పటికీ ఉన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కట్టెల పొయ్యిపై వంటలు చేస్తున్నారు. అలాంటి మహిళలు ఆసుపత్రులకు వస్తున్నారు. వాయు కాలుష్యం వల్ల కూడా వ్యాధి సోకుతోంది. నెలకు 12 నుంచి 15 వరకు ఇలాంటి కేసులు బయటపడుతున్నాయి.

రెండేళ్లుగా నిర్ధారణ పరీక్షలు..

ప్రభుత్వ వైద్య కళాశాల రావడం వల్ల మహారాజా ప్రభుత్వ ఆసుపత్రిలో గత రెండేళ్లుగా వ్యాధి నిర్ధారణకు సంబంధించిన పరీక్షలు ముమ్మరంగా జరుగుతున్నాయి. తీవ్రమైతే విశాఖపట్నంలో ఉన్న పలు క్యాన్సర్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నాం. ఈ రెండేళ్లలో అన్ని రకాల క్యాన్సర్లకు సంబంధించి ఇప్పటివరకు రెండు జిల్లాల్లో 475 కేసులు నమోదయ్యాయి.

ముందుగానే పరీక్షలు..

విపరీతమైన దగ్గు, నోటి నుంచి రక్తం రావడం, బరువు తగ్గడం, అలసట, నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, స్వరంలో మార్పు తదితర లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. ప్రారంభ దశలో గుర్తిస్తే మందుల ద్వారా జీవన ప్రమాణాన్ని పెంచుకోవచ్చు. ధూమపానానికి దూరంగా ఉండటం, సమస్యను గుర్తించడానికి ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. మహారాజా ఆసుపత్రిలో గుర్తించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. సద్వినియోగం చేసుకోవాలి.

కారణాలివీ..

మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. క్రమశిక్షణ లేని నడవడిక, తినే ఆహారం మీద అదుపు లేకపోవడం, నిద్ర దూరమవడం, వ్యాయామం చేయకపోవడం, పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, తీవ్ర భావోద్వేగాలు, ఖైనీ, గుట్కా, మద్యం తదితరాలకు బానిసలు కావడంతో ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయి.

గుంతల దారి.. గుండెలు జారి


అధ్వానంగా సంతకవిటి- పాందూరు ఆర్‌అండ్‌బీ రహదారి


గుంతలమయంగా మామిడిపల్లి- మండవకురిటి మార్గం


రాజాం నియోజకవర్గ పరిధిలోని పలు మార్గాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. సంతకవిటి, రాజాం, రేగిడి, వంగర మండలాల్లో కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు విస్తరించి ఉన్నాయి. ఏళ్ల నాటివి కావడం, మరమ్మతులు లేకపోవడంతో ఎక్కడికక్కడే గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో బాగుచేసేందుకు అధికారులు కనీసం చర్యలు చేపట్టలేదు. ఈక్రమంలో వర్షాలు, వరదల కారణంగా మరింత దెబ్బతిన్నాయి. తాత్కాలికంగానైనా బాగు చేయాలని చోదకులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఈఈ జేమ్స్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. జిల్లాలో పాడైన దారుల మరమ్మతులకు రూ.6 కోట్ల నిధులు వచ్చాయని, టెండర్లు పిలిచి పనులు చేపడతామని చెప్పారు.


– న్యూస్‌టుడే, సంతకవిటి


సంతకవిటి- రాజాం దారి ఇలా..


ప్రమాదకరంగా కృష్ణంవలస- కొండగూడేం రోడ్డు

బతుకు చిత్రాలు.. కళారూపాలు




వంటకు తీసుకెళ్తున్న వెదురు కర్రలు..


పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయం కొత్త రూపు సంతరించుకుంటోంది. మన్యం ప్రజల జీవన విధానాన్ని తెలిపే చిత్రాలు, ఆదివాసీ సంస్కృతికి అద్దం పట్టే కళారూపాలు కలెక్టరేట్ గోడలపై రూపుదిద్దుకుంటున్నాయి. పూర్వీకుల పూజలు, కుటుంబాల బంధం, దాంపత్య జీవితం, పోడు వ్యవసాయం, పంటలను ఇళ్లకు తీసుకువడం లాంటి తదితరాలు కళ్లకు కట్టినట్లుగా చిత్రాలను గీశారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం


కందికొత్తల పండగలో


జీలుగు కల్లు కోసం..


సామలు దంచే పడుచులు..



జలం కాదు.. గరళం

కలుషిత నీరు తాగడం, నిల్వఉన్న ఆహారం తీసుకోవడం, అపరిశుభ్ర పరిసరాలు, ఆహారంపై ఈగలు వాలడం.. తదితర కారణాలతో ఉమ్మడి జిల్లాలో అతిసారం విజృంభిస్తోంది. ఇప్పటికే ఎస్.కోట, పాచిపెంట, గుర్ల, దత్తిరాజేరు తదితర ప్రాంతాల్లో బాధితులు మంచం పట్టారు. అయినప్పటికీ కొన్నిచోట్ల అధికారులు ఇంకా అప్రమత్తం కాలేదు. గ్రామాల్లో అధ్వాన పారిశుద్ధ్యమే దీనికి నిదర్శనం. మరో వైపు తాగునీటి పైపులైన్లు ఎక్కువగా మురుగు కాలువల్లో నుంచి వెళుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సాలూరు గ్రామీణం, పాలకొండ


పార్వతీపురం వరహాలు గెడ్డలో ప్రధాన పైపులైను

జిల్లాలోని పురపాలక సంఘాల్లో కుళాయిల ద్వారా తరచూ కలుషిత నీరు వస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పార్వతీపురం పురపాలక సంఘం 24 వార్డులో పురుగులున్న నీరు రావడం గతంలో తీవ్ర ఆందోళన కలిగించింది. స్థానికంగా చర్చనీయాంశమైంది. బైపాసు రోడ్డు, ఇతర కాలనీల్లోనూ అదే పరిస్థితి. సాలూరు, పాలకొండ పురపాలక సంఘాల్లోనూ వ్యర్థజలాలు వస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అందుకు ప్రధాన కారణం పలుచోట్ల పైపు లైన్లు మురుగు కాలువల్లోంచి వెళ్లడమే. మరికొన్ని ప్రాంతాల్లో భూమిలోపల పైపులకు లీకులు ఏర్పడడంతో మట్టి, మురుగు చేరుతోందనే ఆరోపణలున్నాయి. ఈ మూడు పట్టణాల్లో 23 శాతం పైపులు కాలువల్లోనే దర్శనమిస్తున్నాయి.

పార్వతీపురంలో ఇలా..

పార్వతీపురం పురపాలక సంఘంలో 6,800 వరకు కుళాయిలున్నాయి. వీటి పైపులైన్లు చాలావరకు కాలువల గుండా వెళుతున్నాయి. వైకేఎం కాలనీ, బెలగాం ఎస్సీ వీధి, గెడ్డవీధి శివారు నుంచి ఎస్సీ కాలనీ, గంటా వీధి, కృష్ణపల్లి, నెయ్యిల వీధి, షిరిడీ సాయి మందిరం తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.


సాలూరు పట్టణంలోని తెలగవీధిలో అపరిశుభ్రంగా నీళ్లట్యాంకు

సాలూరులో..

సాలూరు పురపాలక సంఘం పరిధిలో 29 వార్డుల్లో 3,137 కుళాయి కనెక్షన్లున్నాయి. రోజూ ఉదయం గంటపాటు మాత్రమే నీరు అందిస్తున్నారు. అయితే చాలా వరకు పైపులే కాకుండా కుళాయిలు సైతం కాలువల్లో ఉన్నాయి. కొన్నిచోట్ల వాటిల్లోకి దిగి నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి. లావేటివీధి, చిట్లివీధి, తెలగవీధి తదితర ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయి.

నగర పంచాయతీ పరిధిలో..

పాలకొండ నగరపంచాయతీ పరిధిలోనూ పలుచోట్ల ఏళ్లుగా మురుగు కాలువల గుండానే వెళుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు కుళాయిలకు సంబంధించిన పైపులైన్లను డ్రైనేజీల గుండా మళ్లించారు. వరదల సమయంలో లీకులు ఏర్పడుతుండడంతో కలుషిత జలాలు వారికి దిక్కవుతున్నాయి. కాపువీధులు, వెంకంపేట, భారతమ్మవారివీధి, ముదునూరువారివీధి, గటాలదెప్పివీధి, కస్పావీధి, తంతితపాలా రహదారి, శెగిడివీధి తదితర చోట్ల ఈ దుస్థితి నెలకొంది.

అధికారులు ఏమన్నారంటే..

కుళాయిల ద్వారా శుద్ధజలాన్ని అందిస్తున్నామని, లీకులను సకాలంలో అరికడుతున్నామని సంబంధిత అధికారులు సన్యాసిరావు, సత్యనారాయణ, కిరణ్‌కుమార్ తెలిపారు. పరిశీలించి, పైపులైన్లు కాలువల్లో లేకుండా చూస్తామని చెప్పారు.


పాలకొండ కస్పావీధిలో మురుగు కాలువ పక్కనే రక్షిత కుళాయి

అదనపు పరిహారానికి అవకాశం


అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

కొత్తవలస, న్యూస్‌టుడే: విశాఖపట్నం-రాయపూర్ జాతీయ హరిత రహదారిలో ఉత్తరాపల్లి వద్ద ప్రతిపాదించిన అంతర మార్పునకు గుర్తించిన భూములపై క్లెయిమ్‌లు దాఖలు చేయాలని ఆర్డీవో కీర్తి కోరారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో చర్చించారు. 35 ఎకరాలు సేకరించాల్సి ఉందని, పరిహారం ప్రకటించి ఏడాదిన్నర కావస్తున్నా ప్రక్రియ ఇంకా అపరిష్కృతంగానే ఉందని గుర్తు చేశారు. ల్యాండ్ కన్వర్షన్ అయిన భూములకు సెంటుకు రూ.3.50 లక్షలు నిర్ణయించారని, వ్యవసాయ భూములకు సెంటుకు రూ.35వేలు పరిహారం ఇస్తున్నారని, ఇది ఎంతవరకు న్యాయమని రైతులు అన్నారు. నిర్ణయించిన పరిహారం ప్రకారం క్లెయిమ్‌లు సమర్పిస్తే.. అదనంగా 30 శాతం వరకు పరిహారం లభించే అవకాశం ఉందని ఆమె వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక పంపాలని తహసీల్దారు బి.నీలకంఠరావుకు సూచించారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు


మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ

విజయనగరం కోట, న్యూస్‌టుడే: కార్తికమాసం సోమవారం పర్వదినాల్లో భక్తులకు పంచారామాల దర్శనం కల్పించేందుకు విజయనగరం నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబరు 3, 10, 17, 24వ తేదీల్లో సాయంత్రం 4 గంటలకు విజయనగరం డిపో నుంచి బస్సులు బయల్దేరుతాయని చెప్పారు. అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (రామలింగేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట(కొమరలింగేశ్వరుడు) ఆలయాల దర్శనానంతరం తిరిగి మంగళవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు ముందుగా www.apsrtconline.in వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చని, జిల్లాలోని ఏ ప్రాంతం వారైనా బుక్ చేసుకుంటే అక్కడి నుంచి బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. వెళ్లి వచ్చేందుకు ఒకరికి సూపర్ లగ్జరీ రూ.2 వేలు, అల్ట్రాడీలక్స్ రూ.1950, ఎక్స్‌ప్రెస్ రూ.1,600 ఛార్జీలుగా ఉంటాయన్నారు.

అయ్యప్ప క్షేత్ర దర్శనానికి..

శబరిమల అయ్యప్ప క్షేత్ర దర్శనానికి వెళ్లే భక్తులకు బస్సులు కావాలంటే ఏర్పాటు చేస్తామని డీపీటీవో తెలిపారు. కార్తికమాసం పిక్నిక్‌ల కోసం ప్రత్యేకంగా విశాఖ, అరకు, పుణ్యగిరి, లంబసింగి, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, టెక్కలి, రావివలస తదితర క్షేత్రాలకు బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు డిపో ప్రబంధకుడు శ్రీనివాసరావు లేదా 99592 25620, 73829 21380, 94403 59596 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అభ్యంతరాలు తెలపాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా వెబ్‌సైట్లో పొందుపర్చామని డీఈవో పగడాలమ్మ తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24 లోపు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలన్నారు. జిల్లాలోని 33 పోస్టులకు గాను 700 మంది దరఖాస్తు చేసుకున్నారు.

డివిజన్ల కేటాయింపు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థలో కొత్తగా బదిలీపై వచ్చిన డీఈఈ, ఏఈలకు నగరపాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య డివిజన్లు కేటాయించారు. ఈఈ టి.రాయల్ బాబు పర్యవేక్షణలో వీరంతా విధులు నిర్వర్తించనున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

27న జిల్లాస్థాయి చెకుముకి పోటీలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి చెకుముకి పోటీలు ఈ నెల 27న పార్వతీపురంలోని ఆర్కే కళాశాలలో నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు. మంగళవారం డీఈవో పగడాలమ్మను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ప్రజలు, ప్రగతి, పర్యావరణం కోసం సైన్సు నినాదంతో నిర్వహిస్తున్న పోటీలను విజయవంతం చేయాలని కోరారు.


డీఈవోకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న సభ్యులు

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరం కేంద్రీయ విశ్వవిద్యాలయం నెక్ శిక్షణ కేంద్రంలోని స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణకు నిరుద్యోగ పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ప్లంబర్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 45 లోపు వయసు కలిగి, ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 94405 527678, 93982 86654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గడువు పెంపు..: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాతపరీక్ష నిమిత్తం ఇవ్వనున్న ఉచిత రెసిడెన్షియల్ డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు రామానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తల్లిదండ్రులను బాధిస్తే శిక్షలు తప్పవు



గోడ ప్రతులు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, వయోవృద్ధులను నిరాదరణకు గురి చేస్తే శిక్షార్హులని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ రూపొందించిన గోడ ప్రతులను కలెక్టరేట్‌లో మంగళవారం ఆవిష్కరించారు. 60 ఏళ్ల పైబడిన వారి రక్షణ బాధ్యత పిల్లలదేనన్నారు. తల్లిదండ్రుల పోషణ, వైద్య వ్యయాలకు నెలకు రూ.10 వేలు చెల్లించాలన్నారు. పిల్లలు ఇబ్బందులకు గురి చేస్తే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవ నాయుడు, అధికారులు కవిత, రామచంద్రరావు, పగడాలమ్మ పాల్గొన్నారు.

మెనూ.. ఆస్వాదిస్తూ తిను

మధ్యాహ్న భోజనంలో మార్పులకు ప్రతిపాదన


భోజనం చేస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే- రాజాం

ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం మెనూలో మార్పులు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆయా ప్రాంతాల వాసుల అభిరుచికి తగ్గట్టు విద్యార్థులకు భోజనం అందించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై జిల్లా స్థాయిలోనే తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్య కమిటీలు, హెచ్ఎంలు, ఎంఈవోలు, వంట నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. ఈ మేరకు సెప్టెంబరు 3న జిల్లా పాలనాధికారి సమావేశం నిర్వహించి.. మెనూ తయారు చేశారు. పోషక విలువలపై వైద్య నిపుణుల అభిప్రాయాలు తీసుకుని తుది అనుమతులకు ప్రభుత్వానికి నివేదించారు. అనుమతి వస్తే అమలు చేస్తారు. దీంతో విద్యార్థులంతా బడుల్లో భోజనం చేస్తారని భావిస్తున్నారు.

వారం	ప్రస్తుత మెనూ	ప్రతిపాదనలు ఇలా
సోమ	హాట్ పొంగల్, కూరగాయల పలావ్/ ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి	కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కి
మంగళ	పులిహోర, దొండకాయ పచ్చడి ఉడికించిన గుడ్డు, రాగిజావ	అన్నం, పప్పుచారు, గుడ్డుకూర రాగిజావ
బుధ	కూరగాయల అన్నం, బంగాళదుంప కూర, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి	అన్నం, కోడిగుడ్డు పులుసు, చిక్కి
గురు	సాంబార్‌బాత్/ లెమన్ రైస్, టమాటా పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ	అన్నం, టమాటా రసం, కాయగూర కూర (పప్పుతోకూడిన), ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్ర	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కి	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కి
శని	అన్నం, ఆకుకూర, పప్పుచారు, తీపి పొంగలి రాగిజావ	పులిహోర, బంగాళదుంప కుర్మా, తీపి పొంగలి, రాగిజావ

జిల్లాలో వివరాలిలా..

విభాగం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	1,316	45,675
ప్రాథమికోన్నత	181	38,830
ఉన్నత	248	28,986

ప్రతిపాదనలు పంపించాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సమష్టి అభిప్రాయాలను తీసుకుని క్రోడీకరించాం. కొత్త మెనూ ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అన్ని జిల్లాల నుంచి ప్రతిపాదనలను కోరింది. తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుంది. – పి.ప్రేమ్‌కుమార్, డీఈవో

ఉన్నట్టుండి.. ఊపిరి వదిలి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: నడుచుకుంటూ వెళ్తుండగా మూర్ఛ వచ్చి తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఎస్.కోట మండలంలోని వెంకటరమణ కూడలి సమీపంలో విశాఖ-అరకు రహదారి పక్కన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన ఎం.రమేష్(45) కొంత కాలంగా ఎస్.కోట పట్టణంలోని ఓ కార్ఖానాలో పనిచేస్తున్నాడు. దుకాణ యజమాని కొన్ని రోజులుగా అందుబాటులో లేకపోవడంతో అతడికి పనిలేకుండా పోయింది. మంగళవారం మధ్యాహ్నం వెంకటరమణపేట వైపు నడుకుంటూ వెళ్లే క్రమంలో మూర్ఛ రావడంతో కింద పడిపోయాడు. స్థానికులు గమనించి చేతిలో తాళాలు పెట్టే ప్రయత్నం చేసి, అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. సమీపంలోని ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందాడు. అతని సంబంధీకులు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో సీఐ వి.నారాయణ మూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు.

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం


అనీష్ (పాతచిత్రం)

కొమరాడ, న్యూస్‌టుడే: ఆడుతూ.. పాడుతూ సరదాగా ఉన్న అయిదేళ్ల బాలుడు విద్యుత్తు తీగకు బలయ్యాడు. కొమరాడ మండలంలోని కూనేరులో జరిగిన ఘటనలో జిన్నాన అనీష్ (5) రాత్రి వేళ బయటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కూనేరు ఎస్బీఐ సమీపంలో నివాసం ఉంటున్న జిన్నాన దేవగిరి, దివ్యకు కుమారుడు అనీష్, కుమార్తె ఉన్నారు. పదేళ్ల క్రితం గుమ్మలక్ష్మీపురం నుంచి కూనేరు వలస వచ్చిన దేవగిరి వడ్రంగి పని చేస్తూ జీవిస్తున్నారు. ఆయన ఇంటి సమీపంలో ఓ చర్చి ఉంది. దాని చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. దానిపై విద్యుత్తు తీగ పడి ఉండటాన్ని ఎవరూ గమనించలేదు. మంగళవారం రాత్రి అటుగా వెళ్లిన బాలుడు కంచెను తాకడంతో షాక్‌కు గురయ్యాడు. హుటాహుటిన అత్యవసర వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పట్టుకొని తల్లిదండ్రులు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. ఎస్ఐ నీలకంఠం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

విశాఖపట్నం(సింధియా), న్యూస్‌టుడే : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం విశాఖలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలు... ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన మజ్జి మణికంఠ(28) ఈనెల 14న పారిశ్రామిక ప్రాంతం కొత్తనక్కవానిపాలెంలోని ద్విచక్ర వాహన షోరూంలో సూపర్‌వైజర్‌గా విధులు చేరాడు. 18న షోరూం పని నిమిత్తం తోటి ఉద్యోగితో కలిసి స్కూటీపై గాజువాక వెళ్తుండగా, మార్గమధ్యలో ఆగి ఉన్న వ్యాన్‌ను స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక సీట్లో కూర్చొన్న మణికంఠ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ ఈనెల 20న సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి ఈ ఏడాది ఫిబ్రవరిలో నగరంలోని కంచరపాలేనికి చెందిన యువతితో వివాహమైంది. గాజువాక పోలీసులు తొలుత గాయాలైనట్టు కేసు నమోదు చేసి, తర్వాత మృతి కింద మార్చారు.

ఏడాదిన్నరగా స్తంభాలే దిక్కు



బలిజిపేట మండలంలోని వంతరాం కేజీబీవీలో అదనపు భవనాల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగక పోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.47 లక్షలు మంజూరు చేసింది. పాత భవనం పైభాగంలో రూ.12 లక్షలతో అదనపు గదుల నిర్మాణాలు చేపట్టినా నేటికీ బిల్లులు చెల్లించలేదు. దీంతో మిగిలిన పనులు ఆపేశారు. దీనిపై విద్యాలయం ప్రిన్సిపల్ కె.మధురవాణి వద్ద ప్రస్తావించగా.. బిల్లులు కాకపోవడంతో పనులు నిలిపేశామని గుత్తేదారు చెప్పారన్నారు.

– న్యూస్‌టుడే, బలిజిపేట

గోదాములు నిరుపయోగం

సాలూరు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాచిపెంటలో నిర్మించిన 2 వేలు, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గోదాములు నిరుపయోగంగా మారాయి. పంటలు నిల్వ చేసేందుకు ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి మరమ్మతులకు గురవగా, మరొకటి ఖాళీగా వదిలేశారు. చివరికి పంట ఆర బెట్టేందుకు కూడా అవకాశం లేకుండా తుప్పలు పెరిగాయి. దీనిపై ఏఎంసీ కార్యదర్శి పి.నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. రైతులు కోరితే అద్దెకు ఇస్తామని, మరో గోదాము బాగు చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట



చెరువు గట్టే డంపింగ్‌యార్డు




పాలకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి రహదారిలోని వెంకటరాయుడు చెరువు గట్టుపై కొన్ని రోజులుగా పాలకొండలో సేకరించిన చెత్త వేస్తున్నారు. దీంతో గుట్టలుగా పేరుకుపోతోంది. పశువులు పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నాయి. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. దీనిపై కమిషనరు ఎస్.సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. చెత్తను విశాఖ తరలించేలా ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పెద్దింపేటలో దాహం కేకలు

బలిజిపేట మండలంలోని పెద్దింపేటలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తాగునీరు సరఫరా కాకపోవడంతో పామాయిల్ తోటలో బోరు వద్దకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. మంగళవారం గ్రామంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. వేసవిలో సమస్య మరింత జటిలం అవుతోందన్నారు. దీనిపై ఎంపీడీవో విజయలక్ష్మి వద్ద ప్రస్తావించగా.. పంచాయతీ కార్యదర్శి, ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం



రక్షిత పథకం.. సేవలు దూరం



జియ్యమ్మవలస మండలంలో అల మండలో మినీ రక్షిత పథకం 2 నెలలుగా పని చేయడం లేదు. 22 కుటుంబాలున్న గ్రామంలో 5,000 లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మించారు. అడుగు భాగం పూర్తిగా పాడవడంతో వదిలేశారు. గ్రామస్థులు బోరు నీటిని వినియోగిస్తున్నారు. ట్యాంకు బాగు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భరత్‌చంద్ర వద్ద ప్రస్తావించగా.. కొత్త ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పాలకొండ రామకళామందిర్ వీధి కూడలిలో బోరు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. - డి.చిన్ని, పాలకొండ

★ పనికిరాని మొక్కలు తొలగించి పరిసరాలు శుభ్రం చేస్తాం. - దేవీవరప్రసాద్, ఏఈ

- న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? జోగింపేట మీదుగా ఇప్పలవలస ఉన్న రహదారి అధ్వానంగా మారింది. మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. - రాముకృష్ణ

★ గతంలో రహదారి మరమ్మతులకు నిధులొచ్చాయి. పనుల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. - చంద్రమౌళి, ఏఈ

- న్యూస్‌టుడే, సీతానగరం

? బుదురువాడ పంచాయతీ టేకులోవలో ట్యాంకు దిగువన బురదగా మారుతోంది. పరిసరాలు పాడవుతున్నాయి. - స్థానికులు

★ పరిస్థితి పరిశీలించి కార్యదర్శిని అప్రమత్తం చేస్తాం. - జీవీఆర్.మూర్తి, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? గోపాలపురంలో పంచాయతీ కార్యాలయం ముందు బోరు ప్లాట్‌ఫారం పాడైంది. నీరు పట్టేందుకు ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు

★ పరిశీలించి బాగు చేస్తాం.

- బసవరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? తుమరాడ నుంచి వెంగాపురం మొదటి బస్టాపు వరకు సిమెంటు రహదారిపై వ్యర్థాలు వేస్తున్నారు. ప్రయాణాలకు అసౌకర్యం కలుగుతోంది. - పి.తిరుపతిరావు


★ రహదారిని పరిశీలించి రెండు రోజుల్లో శుభ్రం చేస్తాం. - వెంకటినాయుడు, కార్యదర్శి

- న్యూస్‌టుడే, బలిజిపేట

ఆక్రమణ చెరలో.. తోటపల్లి కాలువ

పాలకొండలో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. పట్టణం మధ్యగుండా ప్రవహిస్తున్న తోటపల్లి సాగు నీటి కాలువ మురుగు కాలువలా మారింది. ప్రభుత్వ ఆస్తిని ఆక్రమిస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజు రోజుకు కాలువ గట్లపై నిర్మాణాలు జోరందుకున్నాయి.

న్యూస్‌టుడే, పాలకొండ, పాలకొండ గ్రామీణం



మురుగు కాలువలా మారిన గెడ్డ

400 ఎకరాలకు సాగు నీరు..

తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలోని శివారు కాలువ పట్టణ పరిధిలో నాలుగు నుంచి అయిదు మీటర్ల వెడల్పుతో 3 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. నాలుగు నుంచి అయిదు మీటర్ల మేర సింగన్నవలస కూడలి నుంచి వడమ శివారు వరకు 400 ఎకరాల పంటలకు సాగు నీరు అందాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. కాలువ పక్కనే పట్టణ ప్రణాళిక అధికారుల అనుమతులు లేకుండానే ఇళ్లు నిర్మించేస్తున్నారు. అయినా జలవనరుల శాఖ, నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.



నాయుడునగర్‌లో బక్కచిక్కిన కాలువ

50 వరకు నిర్మాణాలు..

కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు ఇదే పరిస్థితి. సీతంపేట రహదారిలో కొత్తగా లే అవుట్లు వెలుస్తున్నాయి. ఈ మధ్యలో కాలువ ఉండటంతో కొందరు ఆక్రమించేస్తున్నారు. ఆసుపత్రి రహదారి నుంచి వడమ వరకు ఇలాంటి నిర్మాణం 50 వరకు వెలిశాయి. పలు చోట్ల గట్టు కబ్జాకు గురైంది. కాలువ పొడవునా 600 మీటర్ల మేర ఆక్రమణకు గురైంది. దీని విలువ రూ.కోట్లలో ఉంటుంది.

ఆధునికీకరణలో తేలుస్తాం.. తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలో ఆధునికీకరణ పనులు త్వరలో చేపడతాం. ఈ సమయంలో పట్టణ పరిధిలోని కాలువల్లో అక్రమ నిర్మాణాలు గుర్తించి తొలగిస్తాం. - కార్తిక్, ఏఈ, జలవనరులశాఖ



విద్యార్థుల మెదడుకు పదును



పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు జరిగాయి. పలువురు విద్యార్థులు పాల్గొని పోటీ పడ్డారు. జి.అనిత (పదో తరగతి), కె.పద్మ (తొమ్మిదో తరగతి), ఆర్.స్వాతి (ఎనిమిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఆర్.ప్రమీల రాణి, మంగమ్మ, లక్ష్మీనారాయణ, మోసా ప్రశంసా పత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

ప్రజాదర్బార్‌కు 274 అర్జీలు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మొండెంఖల్లులో ప్రజాదర్బార్ నిర్వహించారు. మొండెంఖల్లు, ఉదయపురం, గుజ్జువాయి, మరిపల్లి, ఉరిడి, జి.శివడ పంచాయతీల నుంచి ప్రజలు తరలివచ్చి 274 అర్జీలు అందజేశారు. వాటిపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కె.రంజిత్‌కుమార్, కన్వీనర్ కొండయ్య, నాయకులు భారతి, కడాయి, రంజిత్‌కుమార్ నాయక్, శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో శిక్షణలతో మేలు



ఉపాధ్యాయులతో సమావేశమైన బాలకృష్ణ

బలిజిపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ డిమాండు చేశారు. చిలకలపల్లి, వంతరాం జడ్పీ పాఠశాలల్లో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం మధ్యలో వృత్యంతర శిక్షణతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. లేకపోతే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. ఆ శాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.జోగినాయుడు, కార్యదర్శి వి.హృషికేశ్, హెచ్‌ఎం సీహెచ్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరు దృష్టికి ఐటీడీఏ సమస్యలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఐటీడీఏలోని సమస్యలను కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సాయిబాబు, పి.రంజిత్‌కుమార్ తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏను యథావిధిగా కొనసాగించాలని, శాశ్వత పీవో, డీడీ, ఈఈ, ప్రబంధకుడు, ఏవో, పర్యవేక్షకుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఐటీడీఏ నిధులు గిరిజన సంక్షేమానికే ఖర్చు చేయాలన్నారు. జీవో 3 పునరుద్ధరణ హామీ అమలు చేయాలన్నారు.

26లోగా దరఖాస్తు చేసుకోవాలి

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న ధ్రువపత్రాల పరిశీలన, 28న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

ప్రయాణం.. దారుణం

ఆంధ్ర- ఒడిశా సరిహద్దులోని కూనేరు, కరడ మధ్య రహదారి దారుణంగా మారింది. భారీ గుంతల్లో మట్టి పేరుకుపోవడంతో బురదలా మారి ప్రయాణికులకు పరీక్ష పెడుతోంది. మూడు రోజులుగా గుంతల్లో లారీలు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

– న్యూస్‌టుడే, కొమరాడ



80 మందికి నేత్ర పరీక్షలు

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి కంటి వైద్యుడు గీతాప్రియపార్వతి, సిబ్బంది 80 మందికి పరీక్షలు చేశారు.

వైకేఎం కాలనీని వీడని సమస్యలు



కాలువను కప్పేసిన పనికిరాని మొక్కలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గం అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న దివంగత యర్రా కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఏర్పాటైన వైకేఎం కాలనీ ప్రజలు ప్రస్తుతం సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో మురుగు, వ్యర్థాల మధ్య కాలం గడిపేస్తున్నారు. కాలనీలో 450 కుటుంబాలు ఉన్నాయి. కొంత భాగం పురపాలికలో, మరికొంత వెంకంపేట పంచాయతీలో ఉంది. దీంతో అభివృద్ధికి దూరం అవుతోంది.



ఎస్పీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో వ్యర్థాలు

తుప్పు పట్టిన బోర్లు..

కాలనీలో రెండు, మూడు రోజులకు ఒకసారి కుళాయి నీరు సరఫరా అవుతుంది. ఇళ్ల మధ్య ఉన్న బోర్లు తుప్పు పట్టి పాడవుతున్నాయి. కొన్నాళ్లుగా నిర్వహణ లేక ఈ పరిస్థితి ఎదురైంది. కాలనీలో కాలువలను శుభ్రం చేయకపోవడంతో పనికిరాని మొక్కలు పెరిగాయి. వాడుక నీరు సరిగా పారడం లేదు. దీంతో పరిసరాలు దోమలకు నిలయంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ నుంచి ఎస్పీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో చెత్త వదిలేశారు. పురపాలిక, పంచాయతీ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పరిసరాలు పాడవుతున్నాయి.

దశల వారీగా పనులు..

పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. కాలువల్లో మురుగు తీత పనులు దశల వారీగా చేస్తున్నాం. వైకేఎం కాలనీలో చెత్త సేకరణ, కాలువల శుభ్రతపై దృష్టి పెడతాం.

- సన్యాసిరావు, ఇన్‌ఛార్జి కమిషనరు, పార్వతీపురం పురపాలిక

పాలకొండలో క్రీడా సందడి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్ కళాశాలల క్రీడా పోటీలకు పాలకొండ డిగ్రీ కళాశాల వేదికైంది. మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయని కళాశాల ప్రధానాచార్యులు డా.ఎం.శ్యాంబాబు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే జయకృష్ణ ప్రారంభిస్తారన్నారు. వాలీబాల్, కబడ్డీ పోటీల్లో 37 జట్లు పాల్గొంటాయని, ఏర్పాట్లు చేస్తున్నట్లు పీడీ సీతారాం తెలిపారు.

పట్టణ ప్రణాళిక కార్యదర్శికి మెమో

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరులోని 2, 3 సచివాలయాలను పుర కమిషనర్ సత్యనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. రెండో వార్డుకు చెందిన పట్టణ ప్రణాళిక కార్యదర్శి మహేష్ హాజరు పట్టికలో సంతకం చేయకుండా.. మూమెంట్ రిజిస్టర్‌లో ప్రధాన కార్యాలయానికి వెళ్తున్నట్లు రాశారు. ఆయన అక్కడకి వెళ్లనట్లు కమిషనర్ గుర్తించారు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మెమో జారీ చేశారు.

సరఫరాకు అంతరాయం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తోణాం పరిధిలో కొత్త విద్యుత్తు లైను వేస్తున్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ గోపాలరావునాయుడు తెలిపారు.

ట్రై సైకిళ్ల పంపిణీ

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు దివ్యాంగులకు కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ట్రైసైకిళ్లు అందజేశారు. కొందరికి వినికిడి పరికరాలు ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కురుపాం గ్రామీణం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఎస్.పద్మావతి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తెలిపారు. అధికారులు శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ముగిసిన మహాసభలు

కలెక్టరేట్ ప్రాంగణం: విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు పేర్కొన్నారు. సంఘ ప్రథమ మహాసభలు మంగళవారంతో ముగించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులుగా భీమరాజ్, రవికుమార్, 15 సభ్యులను ఎంపిక చేశారు.

కార్మికుల సంఖ్య పెంచాలి

పార్వతీపురం పురపాలిక: జిల్లా కేంద్రంలో జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను పెంచాలని సిటు నాయకుడు వెంకటరమణ డిమాండు చేశారు. పారిశుద్ధ్య కార్మికులతో సమస్యలపై చర్చించారు.

బాధ్యతల స్వీకరణ



సీతంపేట: సీతంపేట ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఈఈగా పి.రమాదేవి బాధ్యతలు చేపట్టారు. ఈఎన్‌సీ కార్యాలయంలో పని చేస్తున్న **రమాదేవి** ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి ఆదేశం

జియ్యమ్మవలస: మండలంలో పెండింగులో ఉన్న ఇళ్ల నిర్మాణాలు డిసెంబరు నెల లోపు పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.రమేష్ ఆదేశించారు. ఇంజినీరింగు సహాయకులతో వంద రోజుల ప్రణాళికపై చర్చించారు.

మంచి నడవడిక అవసరం

కొమరాడ, సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచి మంచి నడవడిక అలవర్చుకోవాలని ఎస్సై నీలకంఠం సూచించారు. మంగళవారం పెదఖేర్జిల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారులు వాహనాలకు దూరంగా ఉండాలన్నారు. ● సాలూరు బాలికల ఉన్నత పాఠశాలలో సీఐ అప్పలనాయుడు చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 100కు ఫోన్ చేయాలని సూచించారు.

రూ. 10 నాణేలపై అపోహలు వీడాలి



నాణేలు విక్రయిస్తున్న సిబ్బంది

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: ప్రజల్లో రూ.10 నాణేలు చెల్లుబాటుపై ఉన్న అపోహలు తొలగించాలని దుకాణదారులకు యూనియన్ బ్యాంకు సీనియర్ ప్రబంధకుడు నూకరాజు తెలిపారు. పార్వతీపురంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతాయన్నారు. వ్యాపారులు వాటిని తీసుకోవాలని సూచించారు.

సప్తాహ పూజలు



సీతానగరం వేణు గోపాల ఆలయ ప్రాంగణంలో భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రుత్వికులు మత్తిరు మల రంగనాథం, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో అంకురార్పణ, యాగశాల అర్చన నిర్వహించారు. – న్యూస్‌టుడే, సీతానగరం

ఏపీవోను తొలగించాలని తీర్మానం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం సాలూరు ఏపీవోను తొలగించాలని ఎంపీటీసీ సభ్యులు తీర్మానం చేశారని ఉప ఎంపీపీ రెడ్డి సురేశ్ తెలిపారు. సర్పంచుల తీర్మానం లేకుండా పనులు చేయాలని కార్యదర్శులకు ఏపీవో చెప్పారని 12 మంది ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. ఆయన సక్రమంగా కార్యాలయానికి రావడం లేదన్నారు. కలెక్టర్‌కు, డ్వామా పీడీకి తీర్మానాలు పంపించామని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా ఆడిట్ కన్వీనర్ పి.వెంకటనాయుడు తెలిపారు. మండల అధ్యక్షులుగా పి.రవీంద్రనాథ్, పి.వెంకటనాయుడులు, ప్రధాన కార్యదర్శిగా, టి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, ఎ.జయలక్ష్మి, కె.ధర్మారావు, జె.సురేష్, బి.ఎరుకునాయుడు, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరిశీలకుడు శ్రీనివాసరావు తెలిపారు.

పోలీసుల త్యాగాలు అజరామరం

గుమ్మలక్ష్మీపురం, పాలకొండ, సీతానగరం, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు, త్యాగాలు వెలకట్టలేనివని ఎల్విన్‌పేట్ సీఐ హరి అన్నారు. పోలీసు అమల వీరుల వారోత్సవాల్లో భాగంగా భద్రగిరి ఏపీఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై శివప్రసాద్, అధ్యాపకులు ఉన్నారు. ● పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీఎస్పీ బెటాలియన్ సీఐ యు.శ్రీను, ఎస్సై రంజిత్‌కుమార్, ప్రిన్సిపల్ శంకరరావు, పీవో వి.అప్పారావు, సీతానగరం ఉన్నత పాఠశాలలో ఏఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమరులైన పోలీసులకు విద్యార్థులు నివాళులర్పించారు.

పోషకులు జాగ్రత్తలు పాటించాలి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పశు పోషకులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి మన్మథరావు సూచించారు. మంగళవారం చినబొండపల్లిలో పశువులకు నట్టల నివారణ టీకాలు వేశారు. ఎమ్మార్‌నగరం పరిధిలో జరిగిన కార్యక్రమంపై వైద్యాధికారి రమేష్‌తో సమీక్షించారు.

పంటలకు పరిహారం ఎలా..?

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలం సమావేశాలకు అధికారులు పూర్తి వివరాలతో రావాలని ఎంపీపీ ఎం.శోభారాణి కోరారు. మంగళవారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. తమ గ్రామంలో పంటలు నమోదు చేయకుండా పరిహారం ఎలా ఇస్తారని రావికోన సర్పంచి రామస్వామి ఏవో అశోక్‌ను ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని ఏవో చెప్పారు. ఎంపీడీవో రూపేష్, ఈవోపీఆర్డీ జీవీఆర్‌మూర్తి, వైద్యాధికారి తిరుమలప్రసాదు, ఉప ఎంపీపీలు రవికుమార్, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారిని ప్రశ్నిస్తున్న రావికోన సర్పంచి

విద్యారంగ పరిరక్షణకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

భామిని, న్యూస్‌టుడే: విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తామని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఇ.తిరుపతిరావు అన్నారు. అత్తికొత్తూరు ప్రాథమిక పాఠశాలలో సంఘ స్వర్ణోత్సవం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు, పీఆర్సీ చెల్లించాలని జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.భాస్కరరావు కోరారు. అనంతరం మండల గౌరవాధ్యక్షుడిగా బి.చిన్నారావు, అధ్యక్షుడిగా ఇ.తిరుపతిరావు, సహాయ అధ్యక్షులుగా టి.సుధారాణి, పి.తిరుపతిరావు, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనకాపల్లి సదస్సుకు పయనం

పాలకొండ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర పరిధిలోని పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు కోరారు. అనకాపల్లిలో జరుగుతున్న ప్రాంతీయ సదస్సుకు స్థానిక నాయకులతో కలిసి బయలుదేరారు. చిన్న చిన్న పనులు చేస్తే వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉందన్నారు. సంఘ నాయకులు జనార్దనరావు, రామ్మూర్తినాయుడు, వైకుంఠరావు, లక్ష్మీనారాయణ, చౌదరినాయుడు, తవిటినాయుడు, సత్యంనాయుడు, దుర్గారావు, పారినాయుడు తదితరులున్నారు.



నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు

తుపానుపై అప్రమత్తం



పాచిపెంటలో సమావేశమైన అధికారులు

పాచిపెంట, న్యూస్‌టుడే: తుపాను ప్రభావం జిల్లాపై పడనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రవి, ఎంపీడీవో పాత్రో సూచించారు. పాచిపెంట ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మన్యంలో కొండ వాగుల వద్ద ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వట్టిగెడ్డ, వేగావతి నదీ తీర గ్రామాల్లో దండోరాలు వేసి గ్రామస్థులను అప్రమత్తం చేయాలన్నారు. ● వీరఘట్టం, న్యూస్‌టుడే: తుపానుపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. వీరఘట్టంలో అధికారులతో సమావేశమయ్యారు. గ్రామ స్థాయిలో సమాచారాన్ని తనకు అందజేయాలన్నారు. రోజూ తాగునీటి పరీక్షలు చేయాలని సూచించారు. దీపావళికి బాణసంచా విక్రయాల అనుమతులకు పాలకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.